సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం | 27 | ఫిబ్రవరి | 2023



‘అన్నమనేని’కి సన్మానం

సిరిసిల్లటౌన్: బీజేపీ స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ అన్నమనేని శ్రీనివాస్‌రావును భారతీ నేషనలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు.



దుర్గామాత వార్షికోత్సవం

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలం భూక్య, బావుసింగ్‌నాయక్‌తండాల్లో ఆదివారం దుర్గామాత వార్షికోత్సవం జరిపారు.

గరిష్టం/కనిష్టం
35.0/18.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆధునిక హంగులతో జీపీ భవనాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయడమే కాకుండా, ఆధునిక హంగులతో నిర్మిస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. రాచర్ల బొప్పాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో జీపీ భవనాలను, మండల కేంద్రంలో డేకేర్ కేంద్రాన్ని ఈనెల 28న మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో ఆగయ్య ఆదివారం పరిశీలించారు. పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఆగయ్య మాట్లాడుతూ సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి కేటీఆర్ కృషి చేశారన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు కోల అంజమ్మ, నేవూరి వెంకట్‌రెడ్డి, పాశం సరోజన, ఎంపీటీసీలు తిరుపతిబాబు, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నంది కిషన్, హసన్, పులి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

654 రోజులుగా అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న మై వేములవాడ ట్రస్టు ప్రతినిధి మహేశ్

వేములవాడ: మై వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో గత 654 రోజులుగా పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఆదివారం 150 మందికి అన్నదానం చేశారు. ట్రస్టు ప్రతినిధులు మధు మహేశ్, ప్రతాప నటరాజ్, పొలాస రాజేందర్, కొప్పుల హన్మండ్లు పాల్గొన్నారు.

అలరించిన కవితాగానం



హాజరైన సాహితీవేత్తలు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల సాహితీ సమితి సారథ్యంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సమాలోచనంలో కవితాగానం పలువురిని అలరించింది. గాంధీనగర్ హనుమాన్ మందిరంలో ఆదివారం డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కందేపి రాణీప్రసాద్, తిరునగరి లక్ష్మణ్ హాజరై మాట్లాడారు. కవిత్వం సమకాలీన సమాజాన్ని సంస్కరించేలా ఉండాలన్నారు. సాహిత్య పోషణకు దశాబ్దాలుగా ముందుంటున్న విషయాన్ని గుర్తు చేస్తూనే రాబోయే రోజుల్లో సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తామన్నారు. కోడం నారాయణ, నేరోజు రమేశ్, గోశికొండ మురారి, దామోదర్, కొలిపాక శోభారాణి, ఈడెపు సౌమ్య, మాధురి అనిత, బాలరాజు, కొక్కుల రాజేశం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్



వెంకట్రావుపల్లిలో కాలిన పత్తిని పరిశీలిస్తున్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లిలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పలువురి టీవీలు కాలిపోయాయి. బస్టాండ్ ప్రాంతంలోని విద్యుత్ స్తంభం వద్ద షార్ట్‌సర్క్యూట్ ఏర్పడింది. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన అయిత మల్లేశం, బూర్గుల నందయ్య, రాజేశంలతో మరో పది మంది ఇళ్లల్లో టీవీలు కాలిపోయాయి. ఫైరింజన్ చేరుకునే సరికి స్థానిక యువకులు మంటలు ఆర్పారు. అయిత మల్లేశం ఇంట్లో నిల్వ చేసిన పది క్వింటాళ్ల వరకు పత్తి పాడయింది. ఆయా కుటుంబాలను సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్ పరామర్శించారు. మల్లేశం కుటుంబానికి రూ.5వేల సాయం చేశారు. వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సర్పంచ్ బూర్గుల నందయ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ నల్లాల బాలరాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు.. ప్రయోగాల వీరులు!

- ప్రయోగాలతో సత్తాచాటుతున్న విద్యార్థులు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉమ్మడి జిల్లావాసుల ఖ్యాతి
- భావి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని సహస్ర, గైడ్‌టీచర్ మహేశ్‌చంద్ర

మనిషి నిత్య విద్యార్థి. మస్తిష్కానికి పనిచెబితే గొప్ప శాస్త్రవేత్తలుగా మారే అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులు తమ ప్రయోగాలతో జాతీయస్థాయిలో శభాష్ అనిపించుకుంటున్నారు. తక్కువ ఖర్చుతో ఎంతో ఉపయోగపడే పరికరాలు తయారు చేస్తూ లోకల్ టాలెంట్‌ను ఢిల్లీస్థాయిలో ప్రదర్శిస్తున్నారు. పలు సైన్స్ ప్రదర్శనల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రశంసలు అందుకుంటున్నారు. విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయులు సైతం పుస్తకాలతో కుస్తీపట్టే పద్ధతికి స్వస్తిచెప్పి ప్రయోగాత్మక బోధనలతో ఆకట్టుకుంటున్నారు. జిల్లానుంచి జాతీయస్థాయిలో అవార్డులు, సత్కారాలు పొందుతున్నారు. రేపు జాతీయ సైన్స్‌డే సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి సత్తాచాటుతున్న బాలమేధావులు.. సైన్స్ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..!! – కరీంనగర్‌డెస్క్

వృద్ధాప్యంలో సహాయకారిగా..

అనారోగ్యం, ఇతర సమస్యలతో మంచాలకే పరిమితమయ్యే వృద్ధుల కోసం రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని పండుగ సహస్ర గైడ్ టీచర్ మహేశ్‌చంద్ర కలిసి ఓల్డేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ బెడ్ రూపొందించారు. ఈ బెడ్ ద్వారా మంచానికే పరిమితమైన వృద్ధులకు ఒక్కరే సపర్యలు చేయవచ్చు. వృద్ధులను బెడ్‌పై నుంచి లేపడం.. వ్యక్తిగత అవసరాలు తీర్చి, మళ్లీ పడుకోబెట్టడం చేయవచ్చు. దీని తయారీకి రూ.10వేల వరకు వెచ్చించారు.

మహిళల కష్టాలు తీర్చేలా..



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని వినీల

స్కూల్‌లో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులు వంటలు వండిన తర్వాత వాటిని తరలించే క్రమంలో పడుతున్న కష్టాలను దూరం చేయాలనే ఆలోచనకు ఆచరణ రూపమే ఈ ఎగ్జిబిట్. గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.వినీల, గైడ్ టీచర్ సంపత్‌కుమార్ మార్గదర్శనంలో ఈ మిషిన్‌ను తయారు చేసింది. ఈ ఎగ్జిబిట్ జేఎన్‌ఎంఎంఎస్‌ఈ సౌతిండియా స్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. దీని తయారీకి రూ.5వేలు వెచ్చించారు.

సమయానికి గుర్తు చేస్తుంది



ఎగ్జిబిట్‌ను వివరిస్తున్న హర్షిత

పాఠశాలకు వచ్చే విద్యార్థులు శానిటైజర్ స్ప్రే, వాటర్ బాటిల్, సోప్ డిస్పెన్సర్ తెచ్చుకుంటారు. ఒక్కోసారి హడావుడిలో ఏదో ఒకటి మర్చిపోయే అవకాశం ఉంది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం చందనాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని దాసరి హర్షిత యాంటీపాండమిక్ వాటర్ బాటిల్‌ను గైడ్ టీచర్ టి.సంపత్‌కుమార్ సాయంతో తయారు చేసింది. ఈ వాటర్ బాటిల్‌లో మూడు భాగాలు ఉంటాయి. పైభాగాన శానిటైజర్ మధ్యలో నీరు కిందిభాగాన సోప్ డిస్పెన్సర్ అమర్చారు. పిల్లలు నీళ్లుతాగే సమయాన్ని గుర్తుచేసేలా టైమర్ కూడా అమర్చారు.

భళా.. తినే బలపం



బలపం తినే అలవాటు ఉన్న వారికి చక్కటి పరిష్కార మార్గాన్ని కనుగొన్నారు గోదావరిఖని జెడ్పీహెచ్‌ఎస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న బి.హరిప్రియ, అప్సియానా సుల్తానా. బియ్యం పిండి.. బెల్లంతో బలపం తయారుచేశారు. దీనిద్వారా రాయడంతోపాటు పిల్లలు తిన్నా ఇబ్బంది ఉండదనే కోణంలో ఎన్‌సీఎస్‌సీలో భాగంగా ‘ఓవర్ కమింగ్ ఆఫ్ పికా డిజార్డర్ ఈటింగ్ స్లేట్ పెన్సిల్’ అనే ప్రాజెక్టును రూపొందించి ఆర్టీఎం నాగపూర్ విశ్వవిద్యాలయం వేదికగా జరిగిన 108వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించారు. ఇది విశేషంగా ఆకట్టుకుంది. ఇదే ప్రాజెక్టును అహ్మదాబాద్(గాంధీనగర్) సైన్స్‌సిటీ వేదికగా నిర్వహించిన 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ఈ ఏడాది జనవరి 27 నుంచి 31వ తేదీ వరకు ప్రదర్శించారు.

గుడ్డు పెంకు తీసే మిషిన్

కోడిగుడ్డు పెంకు తీసేందుకు విద్యార్థులు పడుతున్న కష్టాలను చూసిన సిరిసిల్లలోని బాలికల ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సమర్థకు ఓ ఆలోచన తట్టింది. గైడ్ టీచర్ భూపాల్‌రెడ్డి సలహాతో ఏకంగా మిషిన్‌ను తయారు చేసింది. ఈ మెషిన్‌పై ఉడకబెట్టిన కోడిగుడ్డు వేస్తే 5 సెకన్లలో పెంకు తీస్తుంది. ఇలా ఒకేసారి నాలుగు గుడ్ల పెంకును తీస్తుంది. ఈ ఎగ్జిబిట్ జాతీయస్థాయిలో ఎంపికైంది.



ఎగ్జిబిట్‌తో విద్యార్థిని సమర్థ



నేషనల్ కాంగ్రెస్‌లో అక్షయ

వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేలా..

ముస్తాబాద్ చుట్టుపక్కల ఎక్కువగా రైస్‌మిల్లులు, ఇతర ఫ్యాక్టరీలు ఉండడంతో ఆ ప్రాంతంలో గాలిలో కార్బన్‌డయాక్సైడ్ ఎక్కువ శాతంలో ఉంటుంది. ఆ ప్రాంత ప్రజలకు వస్తున్న శ్వాసకోశ, ఇతరత్రా అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపేందుకు చేసిన పరిశోధనకు రూపం ఎయిర్‌ఫిల్టర్. ముస్తాబాద్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దీటి అక్షయ, గైడ్ టీచర్ రాజ్‌మహ్మద్ సలహాలు, సూచనలతో ఈ ఎయిర్ ఫిల్టర్‌ను తయారు చేశారు. ఈ మిషిన్ ద్వారా ఎక్కువ పీడనం, తక్కువ ఉష్ణోగ్రతలో కార్బన్‌డయాక్సైడ్‌ను ద్రవస్థితిలోకి చేర్చవచ్చు. పీడనాన్ని మరింత పెంచడం ద్వారా కార్బన్‌డయాక్సైడ్‌ను ఘన స్థితిలోకి మార్చవచ్చు. దీన్ని విద్యార్థిని అక్షయ, గైడ్‌టీచర్ రాజ్‌మహ్మద్ ఇటీవల గుజరాత్‌లో జరిగిన నేషనల్ సైన్స్ కాంగ్రెస్‌లో పేపర్ ప్రజెంటేషన్ చేశారు. అక్కడికి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకుల అభినందనలు అందుకున్నారు.

నేషనల్‌కు మూడు ప్రాజెక్టులు



రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి ఇన్‌స్పైర్ మానక్‌లో మూడు ప్రాజెక్టులు నేషనల్‌స్థాయికి ఎంపికయ్యాయి. ఇందులో ఒక ప్రాజెక్టు సౌతిండియా స్థాయిలో మూడోస్థానంలో నిలిచింది. నేషనల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌లో ఒక ఎగ్జిబిట్ నేషనల్ లెవల్‌లో పాల్గొని అప్రిషియేషన్ సర్టిఫికెట్ పొందింది. ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఎల్లవేళలా ప్రోత్సాహం అందిస్తాం. జిల్లా నుంచి మరిన్నీ ఆవిష్కరణలు వచ్చేలా కృషి చేస్తాం.
– పాముల దేవయ్య, జిల్లా సైన్స్ అధికారి

మేధావుల మాస్టారు



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఘన్ముక్ల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఏ.వేణుగోపాల్‌రెడ్డి బాల మేధావులను తయారుచేయడంలో ముందుంటాడు. పిల్లలకు ప్రయోగాత్మక బోధనలు చేస్తుంటారు. 2016, 2018లో జరిగిన నేషనల్ టీచర్స్ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. 2017లో ఇండియా ఇంటర్‌నేషన్ సైన్స్ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. రీజనల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ భోపాల్, మైసూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నారు. 2017లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. జాతీయ సైన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘నీడ్ ఆఫ్ సైన్స్ టు బీ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇన్ టు ఏ వే ఆఫ్ లైఫ్’ (జీవన అవసరాల కోసం శాస్త్ర విజ్ఞానం) అంశంపై ఎస్‌సీఈఆర్‌టీ వారు ఈనెల 28న నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.

సృజనాత్మకత వెలికితీసేలా..



విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన శక్తిని వెలికితీయడంలో వెన్నంటి ప్రోత్సహిస్తున్నారు శంకరపట్నం మండలం కొత్తగట్టు జెడ్పీ స్కూల్ అసిస్టెంట్ కట్ట వేణుగోపాలాచారి. కరీంనగర్‌కు చెందిన ఈయన ఎమ్మెస్సీ (ఫిజిక్స్), బీఈడీ చేసి 1996లో ఎస్జీటీగా సుల్తానాబాద్ మండలంలో విధుల్లో చేరారు. 2015 నుంచి కొత్తగట్టులో చేస్తున్నారు. 2015లో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో అవార్డు సాధించారు. 2022 నవంబర్‌లో అసోం రాష్ట్రం గౌహతిలో ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థిని సీహెచ్.నిఖిలతోపాటు పాల్గొన్నారు. జాతీయ సైన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ‘నీడ్ ఆఫ్ సైన్స్ టు బీ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఇన్ టు ఏ వే ఆఫ్ లైఫ్’ అంశంపై ఎస్‌సీఈఆర్‌టీ వారు ఈనెల 28న నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.

ఉత్తమ ప్రదర్శనలు.. అవార్డులు



ఆటపాటలతోపాటు జనరల్ నాలెడ్జ్, సైన్స్ ప్రయోగాలు, వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయడంలో ఉపాధ్యాయుడు బాసబత్తిని ఓదెలుకుమార్ ప్రత్యేకత. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన ఓదెలుకుమార్ ఎమ్మెస్సీ (భౌతిక రసాయన శాస్త్రం) బీఈడీ చేశారు. సైన్స్ పాఠాలను ప్రయోగపద్ధతిలో బోధిస్తుంటారు. ఏటా ఫిబ్రవరి 28న ‘లో కాస్ట్– నో కాస్ట్’ పరికరాలతో సైన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ పొంది 2009 నుంచి ప్రతి వేసవిలో జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 2011లో ఎస్‌సీఈఆర్టీ ద్వారా కంప్యూటర్ శిక్షణ పొంది మన టీవీ చానెల్ ద్వారా 7వ తరగతికి సంబంధించి ‘కాంతి పరావర్తనం’ పాఠ్యాంశాన్ని బోధించారు. పలు రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం మానకొండూర్ మండలం పచ్చునూర్ జెడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 28న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు.

అచేతన స్థితిలో కొడుకు

- వైద్యమందించలేని స్థితిలో తల్లి
- ఆర్థిక సాయం కోరుతున్న చేనేత కుటుంబం



సాయం చేయాలని కోరుతున్న తల్లి, కుమారుడు

కోనరావుపేట(వేములవాడ): అసలే నిరుపేద కుటుంబం.. కూలి పనికి వెళ్తేనే కుటుంబం గడిచే పరిస్థితి. నిత్యం మరమగ్గాల పనికి వెళ్లి తల్లిని పోషించుకుంటున్న కొడుకును విధి వక్రించింది. అకాస్మత్తుగా అచేతన స్థితికి వెళ్లాడు. నిరుపేద కుటుంబం కావడంతో చేతిలో చిల్లిగవ్వలేని ఆ తల్లి తన కుమారున్ని ఎలా బతికించుకోవాలో అర్థం కాక సాయం కోసం చేతులు చాస్తోంది. దాతలు స్పందించి తన కుమారున్ని బతికించాలని కోరుతోంది.

దినసరి కూలికి పెద్ద కష్టం

కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన తడుక సత్యనారాయణ(38) అద్దె ఇంట్లో తల్లితో ఉంటున్నాడు. తండ్రి నర్సయ్య చిన్నప్పుడే మృతిచెందాడు. గతంలో పుణేలో పనిచేసిన సత్యనారాయణ కొంతకాలంగా సిరిసిల్లలోని సాంచాల కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత పదిహేను రోజులుగా కాలు, చేయి పనిచేయకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లేందుకు డబ్బులేక సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. వారం రోజులు చికిత్స అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో అతన్ని డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. ప్రైవేట్ వైద్యానికి లక్షల రూపాయలు కావాలని చెప్పడంతో ఆపన్నహస్తం కోసం తల్లి ఎదురుచూస్తోంది.

నా కొడుకును బతికించండి

నేను వృద్ధాప్యంతో ఎలాంటి పనులు చేయలేను. నా కొడుకు తెచ్చే సంపాదనపైనే ఆధారపడి బతుకుతున్నాను. ప్రస్తుతం నా కొడుకు అచేతన స్థితిలో ఉన్నాడు. వైద్యం చేయించలేని నిరుపేద కుటుంబం మాది. దాతలు స్పందించి నా కొడుకును బతికించండి.
– తడుక సుశీల, బాధితుని తల్లి

తడుక సుశీల బ్యాంక్ ఖాతా వివరాలు
ఖాతా నంబర్ : 62287672962
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీహెచ్‌వై0020140
బ్రాంచ్: సిరిసిల్ల

వీరసావర్కర్ వర్ధంతి



చందుర్తి(వేములవాడ): మండలంలోని మల్యాలలో వీరసావర్కర్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. వివేకానంద సేవా సమితి, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు వీరసావర్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. సుధాకర్, తిరుమల్, మధు, శివరాజ్, అనిల్, సతీశ్, నరేశ్, సాయికుమార్, చంద్రం ఉన్నారు.

కొండగట్టు దొంగలు దొరికారు..!

- బీదర్ వెళ్లి పట్టుకొచ్చిన పోలీసులు
- ముందే వెల్లడించిన ‘సాక్షి’
- అంజన్న ఆభరణాల గుర్తింపునకు యత్నాలు
- త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం





చేతులకు గ్లౌసులు వేసుకోని నిందితులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/జగిత్యాలక్రైం/కొండగట్టు: కొండగట్టులోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం వేకువజామున జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఆలయంలోని సీసీ పుటేజీలు పరిశీలించి, వేలిముద్రలు సేకరించిన పోలీసులు... పాతనేరస్తుల పనిగా నిర్ధారణకు వచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా నారాయణఖేడ్ సమీపంలోని ఓ తండాకు చెందిన 8 మంది చాలాకాలంగా చోరీలు చేస్తూ.. తప్పించుకునేందుకు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతంలో మకాం వేశారు. వివిధ ప్రాంతాల్లో అపహరించిన ఆభరణాలను కర్ణాటకలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

పథకం ప్రకారమే దొంగతనం..

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనం చేసేందుకు దొంగలు ముందే పథకం రూపొందించుకున్నారు. అనుకున్నట్లుగానే ఈనెల 24న కొండగట్టు చేరుకున్నారు. దిగువ ప్రాంతంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేశారు. గుట్టపైకి చేరి భేతాళస్వామి ఆలయం వెనకాల మద్యం సేవించారు. శుక్రవారం వేకువజామున 1.20 గంటల తర్వాత భద్రతా సిబ్బంది ఆలయం ఎదుట ఉండడాన్ని అదనుగా భావించిన దొంగలు.. భక్తుల వేషధారణలో ఆలయం వెనుక నుంచి లోనికి ప్రవేశించి చోరీ చేశారు. ఆభరణాలతో వచ్చిన దారినుంచే పారిపోయారు. సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఉంటాయో రెక్కీలో గుర్తించిన దొంగలు.. వాటికి చిక్కకుండా ఉండేందుకు చోరీ అనంతరం ఆలయం వెనుకవైపు ఉన్న గుట్టపై నుంచి కిందికి దిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జగిత్యాల మెయిన్ రోడ్డుకు చేరుకుని ద్విచక్రవాహనాలపై కోరుట్ల, మెట్‌పల్లి మీదుగా.. కామారెడ్డి, నారాయణఖేడ్ నుంచి బీదర్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అదే సమయంలో దొంగలు నారాయణఖేడ్, కామారెడ్డి, ఎల్లారెడ్డిపేట, వేములవాడ మీదుగా కొండగట్టు చేరినట్లు అనుమానిస్తున్నారు. వచ్చిన దారిన వెళ్తే పట్టుబడుతామనే ఆలోచనతో దొంగలు ఇలా.. వలయాకారాన్ని ఎంచుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

స్థానిక నేరస్తుడితో పరిచయం

స్థానికంగా ఉండే ఓ పాత నేరస్తుడిని పరిచయం చేసుకున్న 8 మంది దొంగలు.. ద్విచక్రవాహనాలపై కొండగట్టుకు చేరుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. వీరిలో ఐదుగురు వివిధ ప్రాంతాల్లో కాపలా ఉండగా.. ముగ్గురు ఆలయంలో చోరీ చేశారని, ఆ తర్వాత అందరూ కలిసి అవే వాహనాలపై బీదర్ పారిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఫింగర్ ప్రింట్స్, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా మరుసటి రోజే దొంగలను గుర్తించారని, మూడు ప్రత్యేక బృందాలు బీదర్ వెళ్లి దొంగలను పట్టుకున్నాయని సమాచారం. ఆభరణాలు స్వాధీనం చేసుకునే యత్నంలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ప్రక్రియ పూర్తయ్యాకే దొంగల వివరాలు వెల్లడిస్తారని తెలిసింది.

రాజన్న సన్నిధిలో భక్తుల సందడి

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

క్లుప్తంగా

ఆర్టీఐ జిల్లా కో–కన్వీనర్‌గా సత్తయ్య


సత్తయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన నమిలికొండ సత్తయ్యను ఆర్టీఐ జిల్లా కో–కన్వీనర్‌గా నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.ముత్తు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. సత్తయ్య మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన జిల్లా కన్వీనర్ ఎండీ అన్వర్‌అలీ, కార్యకర్తల సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్‌కు సత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో కోతి మృతి


కనగర్తిలో విద్యుత్ తీగలపై ఉన్న కోతి మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తిలో ఆదివారం విద్యుదాఘాతంతో వానరం మృతిచెందింది. స్తంభం ఎక్కిన కోతికి రెండు విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కోతులు గుంపుగా చేరుకున్నాయి. గ్రామపంచాయతీ సిబ్బంది వానర మృతదేహాన్ని బయటకు తీయడంతో కోతుల గుంపు వచ్చి తీసుకెళ్లింది.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని స్తంభంపల్లి, బోయినపల్లి శివారులో ఆదివారం అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై అభిలాశ్ తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఇసుక అక్రమ రవాణ చేస్తున్న ట్రాక్టర్లు కనిపించగా.. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇసుక వాహనం పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి శివారులో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. అక్కపల్లి శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా.. ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా రవాణాకు సంబంధించిన అనుమతి పత్రాలు లేవు. దీంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ నేదూరి సతీశ్‌పై కేసు నమోదు చేశారు.

భూమిలేని పట్టాలు !

- 11 ఏళ్ల క్రితం కేటీఆర్ చేతుల మీదుగా పంపిణీ
- రెండెకరాల చొప్పున 90 మందికి అందజేత
- అందరికీ అందుతున్న రైతుబంధు
- భూమి చూపించని అధికారులు
- భూముల్లోకి వెళ్తే కేసులు పెడుతున్న అటవీశాఖ అధికారులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుల విన్నపం


ఆందోళన చేస్తున్న రైతులు


రైతులు చదును చేసుకున్న భూమి


"ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు సట్ల పద్మ. ఈమెకు పదకొండేళ్ల క్రితం పోడుభూముల పట్టా ఇచ్చారు. అంతకుముందే పద్మ సాగు చేసుకుంటున్న రెండు ఎకరాల భూమికి హక్కుపత్రాలను 11 ఏళ్ల క్రితం అందజేశారు. పట్టాలు ఇచ్చినప్పటికీ దున్నుకోవడానికి భూమిని చూపించలేకపోయారు. రైతుబంధు డబ్బులు సైతం వస్తున్నాయి."

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పదకొండేళ్ల క్రితం భూమి పట్టాలు ఇచ్చిన వేళ ఆ కుటుంబాల్లో సంతోషాలు నిండాయి. అప్పటి వరకు పోడుసాగుచేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడంతో ఆత్మాభిమానంతో బతుకుదామని ఆశపడ్డారు. పట్టాలు పంపిణీ చేసిన అధికారులు భూమి హద్దులు చూపెట్టలేదు. ఆ భూముల్లోకి ఇప్పుడు వెళ్తే అటవీశాఖ అధికారులు కేసులు పెడుతున్నా రు. భూముల్లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నా రు. పట్టాలు ఇచ్చిన అధికారులు తమకు భూమి చూపెట్టాలని ఆ రైతులు డిమాండ్ చేస్తున్నారు.

90 మందికి 180 ఎకరాలు

ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌లో పదకొండేళ్ల క్రితం 90 మందికి రెండెకరాల చొప్పున అప్పటి ఎమ్మెల్యే కేటీఆర్ చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేశారు. అప్పటి తహసీల్దార్ సుమాచౌదరి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించాకే రైతులను గుర్తించి, పట్టాలు మంజూరు చేశారు. అయితే తమ పరిధిలోని భూములకు రెవెన్యూ అధికారులు ఎలా పట్టాలు ఇస్తారని అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు తెలుపుతున్నారు. దీంతో పట్టాలు చేతుల్లో ఉన్నప్పటికీ సాగు చేసుకునేందుకు భూములు చూపెట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు భూమి చూపెట్టాలని రైతులు ఇప్పటికే మూడు సార్లు ధర్నాలు చేశారు. రైతులకు కొత్త పాసుపుస్తకాలు సైతం వచ్చాయి. ప్రస్తుతం 90 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు సాయం కూడా అందుతుంది.

భూములు దున్నితే కేసులే

పట్టాలు తీసుకున్న రైతులు ఆ భూముల్లోకి వెళ్లి సాగు చేసుకోవడానికి ప్రయత్నిస్తే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం అర్హులను గుర్తించి పట్టాలు ఇస్తే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆందోళనలకు ప్రతిపక్ష పార్టీలు మద్దతునిస్తున్నాయి. ఇప్పటికైనా రెండు శాఖల అధికారులు సమన్వయంతో భూమి హద్దులు గుర్తించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

భూముల్లోకి పోతే కేసులు


పట్టాలు ఇచ్చినప్పటికీ భూముల్లోకి వెళ్తే అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. భూమి చదును చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– బోనాల వెంకటి, రైతు

హద్దులు నిర్ణయించాలి


పోడుభూముల కోసం రెండు ఎకరాలకు హక్కుపత్రాలు ఇచ్చారు. ఇప్పటికీ భూమి హద్దులను చూపించలేదు. అటవీశాఖ అధికారులు మాత్రం అడ్డుకుంటున్నారు. భూమి హద్దులు చూపించకపోవడం అన్యాయం.

– కంకనాల బాలవ్వ, మహిళారైతు

సర్వే చేస్తున్నాం


హక్కుపత్రాలు ఇచ్చిన భూములను సర్వే చేస్తున్నాం. అప్పట్లో పట్టాలిచ్చిన భూములు కొంతమేరకు అటవీశాఖ పరిధిలో ఉండడంతో వారు అభ్యంతరాలు తెలిపారు. ఆ శాఖ అధికారులతో ఇటీవల చర్చించాం. కలెక్టర్ ఆదేశాలతో భూములను సర్వేచేస్తాం. హద్దులు నిర్ణయించి పట్టాలు ఉన్న రైతులకు కేటాయిస్తాం. ఆందోళన చెందొద్దు.

– జయంత్‌కుమార్, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట

రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడరూరల్: రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆరోపించారు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లిలో ఆదివారం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రతాప రామకృష్ణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో సాగుతున్న అవినీతి పాలనను అరికట్టేందుకు ఉద్యమించాలన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ బండ మల్లేశం, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, మండలాధ్యక్షుడు జక్కుల తిరుపతి, కిశోర్, బూత్ కమిటీ అధ్యక్షుడు ముత్తయ్య పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- బీజేపీ నాయకుడు లగిశెట్టి శ్రీనివాస్

ముస్తాబాద్(సిరిసిల్ల): కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు లగిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో ప్రజాగోస.. బీజేపీ భరోసా కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అగ్రరాజ్యంగా నిలిపిందన్నారు. ఎన్నికల హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కస్తూరి కార్తీక్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, ప్రశాంత్, నర్సింలు, సంపత్, జనార్దన్, అజయ్, వేణు, కల్యాణ్, బాలాజీ, రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, రమేశ్, సాయి, స్వామి పాల్గొన్నారు.

విశాల షాపింగ్‌మాల్‌లో అనసూయ సందడి


షాపింగ్‌మాల్‌లోని పట్టుచీరల విభాగాన్ని ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ


వస్త్రాలను పరిశీలిస్తున్న అనసూయ

సిరిసిల్లఅర్బన్: సినీనటి, ప్రముఖ టీవీ వ్యాఖ్యాత అనసూయ ఆదివారం సిరిసిల్లలో సందడి చేసింది. జిల్లా కేంద్రంలోని ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ విశాల షాపింగ్ మాల్‌లో నూతన పట్టుచీరలు, సంప్రదాయ దుస్తుల విభాగం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైంది. నూతన విభాగాన్ని ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసింది. అనంతరం మాల్‌లో తిరుగుతూ పట్టుచీరలను పరిశీలించి మాట్లాడారు. విశాల షాపింగ్‌మాల్‌లో సరికొత్త వెరైటీలతో పట్టుచీరలు, ఇతర సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనసూయ వస్తుందని తెలిసిన అభిమానులు, పట్టణ ప్రజలు షాపింగ్ మాల్‌కు భారీగా తరలివచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు గుండ్లపల్లి నీరజ, దార్నం అరుణ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, యజమానులు వేముల శ్రీనివాస్, విష్ణు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శుభకార్యంలో అగ్నిప్రమాదం

- గ్యాస్ సిలిండర్ లీకే చెలరేగిన మంటలు
- కాలిన టెంట్, వేదిక


కాలిపోయిన సామగ్రి

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం బందనకల్‌లో గ్యాస్ సిలిండర్ లీకేజీతో అగ్నిప్రమాదం జరిగింది. బాధితుడు పాతూరి లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు. లక్ష్మారెడ్డి ఇంట్లో ఆదివారం ఓ శుభకార్యం నిర్వహిస్తున్నాడు. ఇంటి బంగ్లాపై టెంట్ వేసి.. అక్కడే వేదికను ఏర్పాటు చేశారు. మరో వైపు వంటలు చేయిస్తున్నారు. ఈక్రమంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు ఎగిసిపడి టెంట్‌కు అంటుకున్నాయి. పక్కనే ఉన్న వేదిక, ఫర్నీచర్, కుర్చీలు, కెమెరాలు, సౌండ్‌సిస్టమ్, వంటకాలు కాలిబూడిదయ్యాయి. ఫంక్షన్ ఉత్సాహంగా సాగుతుండగా జరిగిన ప్రమాదంతో అందరు షాక్‌కు గురయ్యారు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులు స్వల్పంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు గమనించి పైపుల ద్వారా నీటిని చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రూ.2లక్షలకు పైగా నష్టం జరిగిందని ఈవెంట్ నిర్వాహకులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

నిరుపేద రజకులకు అండగా ఉండాలి


బాధిత కుటుంబానికి నగదు, బియ్యం అందిస్తున్న శ్రీనివాస్

ముస్తాబాద్(సిరిసిల్ల): నిరుపేద రజకులకు అండగా ఉంటామని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మృతిచెందిన దీటి మల్లయ్య కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రజకులను ఆదుకునేందుకు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నారని, అలాగే ఉపాధి అవకాశాలను మెరుగు పరిచారన్నారు. రజకులు ఇంకా సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వెనుకబడ్డ కులబాంధవులకు సాయం అందించాలన్నారు. మల్లయ్య కుటుంబానికి క్వింటాలు బియ్యం, రూ.5వేల నగదు అందించారు. ఎంపీపీ శరత్‌రావు రూ.5వేలు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్ రూ.5వేలు, బండారి సత్తయ్య రూ.5వేలు అందించారు. రజక సంఘం నాయకులు దీటి నర్సింలు, దేవయ్య,బాలయ్య, రాములు, దీటి రాజు, ఎల్లయ్య, యాదగిరి, రాజు, శ్రీకాంత్, టోని తదితరులు పాల్గొన్నారు.

తల్వార్‌తో విన్యాసాలు చేసిన యువకుల అరెస్ట్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలో జరిగిన ఓ పెళ్లి భరాత్‌లో తల్వార్‌లతో విన్యాసాలు చేసిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మామిడిపల్లిలో ఈనెల 23న జరిగిన పెళ్లి భరాత్‌లో మామిడిపల్లికి చెందిన బడుగు వంశీ, బడుగు దినేశ్, బడుగు మైఖేల్ తల్వార్‌లతో విన్యాసాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. వారి నుంచి రెండు తల్వార్‌లను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. గ్రామాల్లో ఎవరైన చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని ఎస్సై కోరారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన వృద్ధురాలు సాయిల్ల కనుకమ్మ(70) ఆదివారం వడదెబ్బతో మృతిచెందింది. స్థానికుల వివరాలు.. కనుకమ్మ మహిళలతో కలిసి బొమ్మకల్‌లో పత్తి ఏరేందుకు వెళ్లింది. పత్తి ఏరుతుండగా మధ్యాహ్నం 2 గంటలకు ఎండకు అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతిచెందగా ట్రాక్టర్‌లో దుర్శేడ్‌కు తీసుకొచ్చారు. మృతురాలికి భర్త ఐలయ్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

దాడి సంఘటనలో నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన రేపాక అమృతపై భూవివాదంలో దాడి చేసిన సంఘటనలో నలుగురిపై ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాలు. రేపాక అమృత మరిది కుటుంబ సభ్యులు రేపాక దేవయ్య, రేపాక బుచ్చవ్వ, రేపాక సురేశ్, రేపాక హరీశ్‌లతో గత ఆరేళ్లుగా భూమి విషయంలో ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఆదివారం అమృత ఇంట్లో ఉన్న సమయంలో నలుగురు వెళ్లి అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మరో సంఘటనలో ఇద్దరిపై..

మరో సంఘటనలో ఎల్లారెడ్డిపేటకు చెందిన దండుగుల తిరుపతితో ఉన్న కుటుంబ కలహాలను దృష్టిలో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, శివరాత్రి శీను దాడి చేశారు. తిరుపతి ఫిర్యాదుతో నరేశ్, శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఊరు ఒక్కటే.. పేర్లు మూడు !

- ఊరు పేరు కట్టలింగంపేట
- విద్యాశాఖలో కట్టకొమ్ముపల్లి
- సెస్‌లో చెరువుకుంటపల్లె
- 1995లో గ్రామపంచాయతీ
- 1976లోనే పాఠశాల ప్రారంభం



ప్రాథమిక పాఠశాల బోర్డుపై కట్టకొమ్ముపల్లి


కట్టలింగంపేట గ్రామం

కట్టలింగంపేట స్వరూపం

గృహాలు	: 198
జనాభా	: 905
పురుషులు	: 476
మహిళలు	: 529

చందుర్తి(వేములవాడ): ఊరు చిన్నదే.. కానీ పేర్లు మూడు. గ్రామపంచాయతీగా ఏర్పడి 28 ఏళ్లు గడుస్తున్నా పాఠశాల, సెస్, ఊరు పేర్లు మూడుగా ఉన్నాయి. గ్రామానికి ఎవరైన కొత్త వచ్చే వక్తులు తికమక పడతారే తప్పా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఏ పేరుతో చెప్పినా అర్థమవుతుంది. విద్యాశాఖలో కట్టకొమ్ముపల్లిగా నమోదు అయింది. బదిలీపై పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు కట్టకొమ్ముపల్లి పేరు గల ఊరు ఎక్కడుందో తెలియక తికమక పడ్డ సందర్భాలు అనేకం ఉ న్నాయి. విద్యాశాఖ జిల్లా అధికారులు కట్టకొమ్ముపల్లి అని అడిగితే పక్కన ఉన్న వారే ఎక్కడో తెలియక పెదవి విరిచే పరిస్థితి ఏర్పడుతుంది.

కట్టలింగంపేటకు పేరు ఎలా వచ్చిందంటే..

చందుర్తి మండలం లింగంపేటకు కనీసం 200 మీటర్ల దూరం కూడా కట్టలింగంపేట గ్రామం ఉండదు. దీన్ని కూడా 50 ఏళ్ల క్రితం పూర్వీకులు లింగంపేట అని పిలిచేవారని పెద్దలు చెబుతుండేవారు. గ్రామానికి వచ్చిన కొత్త వ్యక్తులు లింగంపేట అని చెబితే తికమక పడుతున్నారని, ఈ గ్రామానికి అనుకుని గురున్నాథం చెరువు కట్ట ఉండడంతో కట్టలింగంపేటగా నామకరణ చేశారు. కానీ కట్టలింగంపేట గ్రామం మాత్రం మల్యాల రెవెన్యూ గ్రామంలోనే ఉంది. అంతేకాకుండా 1995 సంవత్సరానికి ముందు మల్యాల గ్రామపంచాయతీ అనుబంధ గ్రామంగా కట్టలింగంపేట ఉండేది. 1995లో గ్రామపంచాయతీని ఏర్పాటు చేసిన సమయంలో పెట్టుకున్న కట్టలింగంపేటగా పిలువబడేది. కట్టలింగంపేటలో 1976 లోనే ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారు. ఆ సమయంలోనే పాఠశాల రికార్డులలో కట్టకొమ్ముపల్లిగా నమోదు చేశారు. అప్పటి నుంచి విద్యాశాఖలో కట్టకొమ్ముపల్లిగా నమోదవుతూ వచ్చింది.

సెస్ ఎన్నికల్లో వెలుగుచూసిన మరో పేరు

కట్టలింగంపేట గ్రామపంచాయతీని సెస్ రికార్డుల్లో మాత్రం చెరువు కుంటపల్లె అని నమోదు చేశారు. ఇటీవల జరిగిన సెస్ ఎన్నికలలో ఎన్నికల సిబ్బందికి విధులు కేటాయించారు. చందుర్తి మండలంలో చెరువుకుంటపల్లె ఎక్కడని అడిగారు. చాలా మంది ఆ గ్రామం తెలియదన్న సమాధానం రావడంతో వారు అవాక్కయ్యారు. చివరికి చందుర్తి సెస్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది కట్టలింగంపేట పేరు చెరువు కుంటపల్లె అని రికార్డులో ఉందని చెప్పారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారి గ్రామానికి మూడు పేర్లు ఉన్నాయన్న విషయాన్ని గ్రామపంచాయతీ ఏర్పడి 28 ఏళ్లు గడిస్తున్న గమనించలేకపోయారు.

మా గ్రామానికి మూడు పేర్లు


గ్రామంలో 200 ఇల్లు కూడా ఉండవు. కానీ మా గ్రామానికి మూడు పేర్లు పెట్టారు. కనీసం అప్పుడున్న గ్రామస్తులకు ఎక్కువగా చదువులేక రికార్డులో ఏముందో తెలియదు. కానీ పనిచేసే అధికారులు కూడా నిర్లక్ష్యంతో ఇష్టానుసారంగా రికార్డులో పేర్లు రాయడంతో మూడు పేర్లు నమోదయ్యాయి. విద్యాశాఖలో, సెస్‌లో ఉన్న పేర్లను మార్పు చేసి కట్టలింగంపేటగా నమోదు చేయాలి.

– యెల్ల నరేశ్, కట్టలింగంపేట

విద్యాశాఖలో పేరు మార్చాలని కోరిన


కట్టలింగంపేట గ్రామపంచాయతీలోని పాఠశాల పేరు కట్టకొమ్ముపల్లిగా విద్యాశాఖ రికార్డులో ఉంది. ఉపాధ్యాయుల బదిలీ సమయంలో చాలా మందికి కట్టకొమ్ముపల్లి పేరు చందుర్తి మండలంలో ఎక్కడ లేదని చెప్పుతుండడంతో చాలా మంది ఉపాధ్యాయులు కౌన్సిలింగ్‌లో ఈ పాఠశాలను ఎంచుకోలేదు. పాఠశాలలో పోస్టులు ఉన్న భర్తీ కాకపోవడంతో ఆ పేరుతోనే శాపంగా మారింది. దీంతో పాఠశాల రికార్డులో ఉన్న పేరును మార్పు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మార్పు చేసేందుకు అవకాశం లేదన్నారు.

– గడప రఘుపతిరావు, డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకుడు, చందుర్తి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం


పాఠశాల రికార్డులో ఉన్న పేరును, సెస్ కార్యాలయంలో నమోదైన పేరు మార్చేందుకు జిల్లా కార్యాలయంలో అవకాశం లేదని జిల్లా అధికారులు చెప్పారు. గ్రామపంచాయతీ పేరున ఆ రెండు శాఖల పేర్లను మార్చాలంటే సచివాలయానికి వెళ్లాలని సూచించారు. దీంతో ఈ రెండు శాఖల పేర్లను మార్పు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే రమేశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లాం. గ్రామానికి మూడు పేర్లు ఉండడంతో చాలా మందికి కట్టలింగంపేట గ్రామమని తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

– ఏనుగుల జమున, సర్పంచ్, కట్టలింగంపేట